క్లుప్తంగా

బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంరెడ్డికి సన్మానం



రాంరెడ్డిని సన్మానిస్తున్న మున్సిపల్ పాలకవర్గ సభ్యులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తిరిగి ఎన్నికైన సాముల రామిరెడ్డిని శుక్రవారం మున్సిపల్ పాలకవర్గ సభ్యులు గజమాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చన రవి, వైస్ చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి, కౌన్సిలర్లు రాజానాయక్, వి.నాగేశ్వరరావు, గంగరాజు, నాయకులు వి.వీరారెడ్డి, కె.వెంకటేశ్వర్లు, వి.నాగరాజు, కె.సైదులు, వై.విజయ్, పి.సంపత్, ఎస్.చందు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని గోపాలపురంలో విద్యుత్ లేన్‌కు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించుటకు శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు మండల విద్యుత్ అధికారి రాంప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలు



గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న సూపర్‌వైజర్ సునిత, టీచర్ కవిత

చిలుకూరు : మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం -4లో పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ సునిత మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నారులను తప్పనిసరిగా పంపించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో అందించే పోషకాహారాన్ని గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో టీచర్ సిరికొండ కవిత, పుల్లమ్మ, గర్భిణులు, చిన్నారులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ ముమ్మరం



బరాఖత్‌గూడెం వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

మునగాల : త్వరలో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో వాహనాల తనిఖీని ముమ్మరం చేసినట్లు మునగాల ఎస్‌ఐ బైరెడ్డి అంజిరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని బరాఖత్‌గూడెం శివారులో నడిగూడెం రోడ్డుపై ప్రయాణించే వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ముగిసేంతవరకు వాహనాల్లో అధిక మొత్తంలో నగదు తరలించవద్దని కోరారు. కార్యక్రమంలో చిలుకూరు మండల ఎంపీఓ ఇబ్రహీం, పోలీస్ సిబ్బంది జానివియా, నిరంజన్, వీరభద్రారెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతంకు సత్కారం



ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకులు

హుజూర్‌నగర్ : ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతంను హుజూర్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకులు హైదరాబాద్‌లో కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు కస్తాల సైదులు, నాయకులు డి.బాబురావు, ఆర్.రాము, ఎస్‌కే.ముస్తఫా, కె.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు పక్కా భవనాలు నిర్మించాలి

నడిగూడెం : మండలంలోని పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేకపోవడంతో సిబ్బంది నానా ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే పక్కా భవనాలను నిర్మించాలని టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు దొంతగాని శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలను అరకొర వసతుల నడుమ అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారని తెలిపారు. కొన్నిచోట్ల పాతశాలలో ఉన్న శిథిలావస్థకు చేరిన గదులలో నిర్వహిస్తున్నారని, ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో అర్థంకాని పరిస్థితి నెలకొన్నదని పేర్కొన్నారు.

కంకర పరిచి.. పనులు మరిచి

- ఏడాది క్రితం నిలిచిన కోదాడ - వాయిలసింగారం రోడ్డు పనులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



కంకర పరిచి వదిలేసిన కోదాడ- వాయిలసింగారం రోడ్డు

కోదాడ : కోదాడ పట్టణంలోని జాతీయ రహదారి నుంచి రామిరెడ్డి పాలెం మీదుగా వాయిలసింగారం వరకు రోడ్డు నిర్మాణానికి ఏడాది క్రితం కంకర పరిచారు. నాటి నుంచి పనులు పూర్తిచేయకుండా వదిలేశారు. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణించే పది గ్రామాల ప్రజలు కంకర రాళ్లపై ప్రయాణం చేయలేక, వాహనాలు వెళుతున్న సమయంలో లేస్తున్న దుమ్ముతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు చోట్ల తాను చేసిన పనులకు బిల్లులు ఇవ్వకపోవడంతో పనులు ఆపివేశానని ఆ బిల్లులు చెల్లిస్తేనే ఈ రోడ్డు పనులు చేస్తానని కాంట్రాక్టర్ అంటుండగా, కాంట్రాక్టర్‌తో మాట్లాడాము పది రోజుల్లో పనులు ప్రారంభించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తామని అధికారులు చెబుతున్నారు. అదేవిధంగా మునగాల మండలం ఆకుపాముల నుంచి నడిగూడెం మండలం రత్నవరం వరకు ఉన్న రోడ్డుపై కంకర వేసి వదిలేశారు. ఈ రెండు గ్రామాల ప్రజలు నిత్యనరకం అనుభవిస్తున్నారు.

రూ. 2.20 కోట్ల నిధులు..

కాగా, కోదాడ హైవే నుంచి వాయిలసింగారం వరకు 6.6 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో దాన్ని పునర్నిర్మించాలని అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు. రూ. 2.20 కోట్లతో టెండర్లు పిలిచి కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. గత ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించాడు. వెంటనే రోడ్డును పూర్తిగా తవ్వి దానిపై కంకర, డస్ట్ కలిపి ఒక లేయర్‌గా వేశారు. అప్పటి నుంచి పనులు చేయకుండా వదిలేశారు. ఈ లోగా ఎన్నికలు రావడంతో ఈ రోడ్డు గురించి పట్టించుకొనే వారు కరువయ్యారు. ఎన్నికల అనంతరం ప్రస్తుత ఎమ్మెల్యే ఈ రోడ్డు విషయంపై ఆరా తీసి వెంటనే పనులను ప్రారంభించాలని లేకపోతే సదరు కాంట్రాక్టర్‌ను తొలగించాలని ఆదేశించినట్లు సమాచారం.

పనులు తక్షణమే ప్రారంభించాలని చెప్పాం



కోదాడ-వాయిలసింగారం రోడ్డు విషయం నా దృష్టికి వచ్చింది. కాంట్రాక్టర్‌తో మాట్లాడి వెంటనే పనులు ప్రారంభించాలని అధికారులకు చెప్పాను. కాంట్రాక్టర్ ముందుకు రాకపోతే అతన్ని తొలగించి మరో కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించాలని చెప్పాం. దీంతో పాటు మునగాల మండలం ఆకుపాముల నుంచి రత్నవరం వరకు ఉన్న రోడ్డు పనులు కూడా వెంటనే చేపట్టాలని చెప్పాను. – నలమాద పద్మావతిరెడ్డి, ఎమ్మెల్యే, కోదాడ

కాంగ్రెస్ నాయకులు కలిసికట్టుగా పనిచేయాలి

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



హరికృష్ణకు నియామకపత్రం అందజేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్ : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం యూత్ కాంగ్రెస్ నాయకులు కలిసికట్టుగా పని చేయాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. యూత్ కాంగ్రెస్ హుజూర్‌నగర్ పట్టణ అధ్యక్షుడిగా నియమితులైన హుజూర్‌నగర్‌కు చెందిన ఆవుల హరికృష్ణకు శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతానికి యూత్ కాంగ్రెస్ నాయకులు తమ వంతుగా కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కుక్కడపు మహేష్ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో రికార్డుల పరిశీలన



పాలకవీడు పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలించి మాట్లాడుతున్న సీఐ చరమందరాజు

పాలకవీడు : పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పోలీస్ అధికారులు, సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చరమందరాజు ఆదేశించారు. శుక్రవారం పాలకవీడు పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులు పరిశీలించి, పోలీస్‌స్టేషన్ పరిధిలో సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓటర్లను ప్రభావితం చేసే వ్యక్తులపై నిఘా ఉంచాలన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా, జైలు శిక్ష విధిస్తారన్న విషయాన్ని తెలియజేయాలని చెప్పారు. కోడ్ అమలులో ఉన్నందున రూ.50 వేలకు మించి నగదు తరలిస్తే సీజ్ చేస్తామన్నారు. నగదు, బంగారం తరలించేవారు సంబంధిత బిల్స్, డాక్యుమెంట్స్ చూపాలని అన్నారు. మట్టపల్లి, నేరేడుచర్ల పరిధిలోని మూసీనది వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాణిజ్య వ్యాపారులు జరిపే ఆన్‌లైన్ లావాదేవీలపైనా దృష్టిసారిస్తామన్నారు. అలాగే పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సేవలు అందించాలని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలు, బహిరంగ మద్యపానం సేవిస్తూ పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్సై లక్ష్మీనర్సయ్య ఉన్నారు.

పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధం కావాలి



మంత్రి ఉత్తమ్ పద్మావతి దంపతుల ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చిలుకూరు : త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు సిద్ధం కావాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కీత వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం చిలుకూరులో జరిగిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీ ఎన్నికల్లో మండలం నుంచి భారీ మెజార్టీ రావాలన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అనంతరం కోదాడ, హుజూర్‌నగర్‌లో ముమ్మరంగా అభివృద్ధి పనులు చేపట్టడంపై హర్షిస్తూ పార్టీ నాయకులు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

పార్టీ నాయకుల మధ్య ఘర్షణ..

కాగా, సమావేశంలో కాంగ్రెస్ నాయకుల మధ్య వివాదం జరిగింది. అదికాస్తా చిలికిచిలికి గాలి వానలా మారి ఘర్షణకు దారితీసింది. గ్రామ శాఖకు తెలియకుండా గ్రామాల్లో ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దని పలువురు గ్రామ స్థాయి నాయకులు మండల నాయకులపై వాగ్వాదానికి దిగారు. ఈవిషయంపై మాజీ ఎంపీపీ బజ్జూరి వెంకట్‌రెడ్డిపై పలువురు నాయకులు ఘర్షణకు దిగారు. కావాలనే గ్రామాల్లో తిరుగుతూ పార్టీ వ్యతిరేక వర్గాన్ని కాంగ్రెస్‌లో చేర్పించాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పింగ్రాతి హనుమంతరావు, ఎంపీపీ బండ్ల ప్రశాంతి కోటయ్య, జెడ్పీటీసీ బొలిశెట్టి శిరీష నాగేంద్రబాబు, మాజీ ఎంపీపీ బజ్జూరి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రక్షణ చట్టాలపై అవగాహన అవసరం

గరిడేపల్లి: మహిళలు, విద్యార్థులకు రక్షణ చట్టాలపై అవగాహన ఉండాలని గరిడేపల్లి ఎస్‌ఐ నరేష్, షీ టీమ్ ఎస్‌ఐ ప్రవీణ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గడ్డిపల్లి ఆదర్శ పాఠశాలలో షీ టీమ్ పోలీస్, కళాజాతా బృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళ రక్షణకు పటిష్ఠంగా పని చేస్తున్నామని, విద్యార్థులు సమస్యలు ఉంటే అధ్యాపకులు, అధికారుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఇంటర్‌నెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని కానీ సైబర్ మోసాలకు గురి కావద్దని, వ్యక్తిగత వివరాలు, బ్యాంక్ ఖాతా, ఏటీఎం కార్డు, ఓటీపీ వివరాలు ఇతరులకు తెలపవద్దన్నారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ భార్గవి, షీ టీమ్ హెడ్ కానిస్టేబుల్ జాఫర్, ఎల్లారెడ్డి, పోలీసు సిబ్బంది సత్యనారాయణ, శ్రీనివాసరావు, భాస్కర్, కళాబృందం ఇన్‌చార్జ్ యల్లయ్య, గోపి, చారి, కృష్ణ, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యకు పరిష్కారం

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని గోపాలపురంలో ఇటీవల విద్యుత్ సరఫరాలో ఫేజ్, న్యూట్రల్‌కు విద్యుత్ సరఫరా కావడంతో గృహోపకరణాలు దగ్ధమవుతున్నాయని ఇటీవల సాక్షిలో ప్రచురితమైన వార్తకు విద్యుత్ అధికారులు స్పందించారు. శుక్రవారం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కంపచెట్లను తొలగించి విద్యుత్ సరఫరాలో కలిగే సమస్యకు పరిష్కారం చూపినట్లు గ్రామస్తులు తెలిపారు.

ప్రతి ఇంటి ఆవరణలో ఇంకుడు గుంత తీయాలి

నడిగూడెం : ప్రతి ఇంటి ఆవరణలో ఇంకుడు గుంత తీయాలని తహసీల్దార్ హేమమాలిని కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంకుడు గుంత నిర్మాణ పనులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్‌డి.ఇమామ్, పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్ పద్మ, సిబ్బంది పాల్గొన్నారు.

తాగు నీటి ఎద్దటి నివారణపై దృష్టి



చిలుకూరులో తాగునీటి బోరును పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ

చిలుకూరు : గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణపై దృష్టి సారించినట్లు జిల్లా మత్స్య శాఖ అధికారి, మండల ప్రత్యేక అధికారి రూపేందర్ సింగ్, ఎంపీడీఓ గిరిబాబు తెలిపారు. చిలుకూరులో నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి బోరును శుక్రవారం వారు పరిశీలించారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ముందుగా గ్రామ పంచాయతీ రికార్డులను వారు పరిశీలించారు. రికార్డుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటింటికీ మిషన్ భగీరథ నీరందేలా చూస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి షరీఫ్‌వుద్దీన్, బిల్ కలెక్టర్ ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నడిగూడెంలో పోలీసుల కవాతు



నడిగూడెంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు, సీఐఎస్ఎఫ్ బలగాలు

నడిగూడెం : జిల్లా ఎస్పీ రాహుల్‌హెగ్డే ఆదేశాల మేరకు శుక్రవారం నడిగూడెం మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన నడిగూడెం, సిరిపురం, వేణుగోపాలపురం గ్రామాల్లో మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, నడిగూడెం ఎస్‌ఐ, సిబ్బంది.. సీఐఎస్ఎఫ్ బృందాలతో కలిసి శుక్రవారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు జరుగనున్నందున ప్రశాంత వాతావరణం కల్పించేందుకు ఈ కవాతు నిర్వహించినట్లు తెలిపారు.

కలెక్టర్‌కు వినతి



కలెక్టర్ వెంకటరావుకు వినతిపత్రం అందజేస్తున్న పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ నాయకులు

హుజూర్‌నగర్ : నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో క్రైస్తవులకు శ్మశాన వాటికలు, కమ్యూనిటీ హాళ్లు మంజూరు చేయాలని నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం సూర్యాపేటలో కలెక్టర్ వెంకటరావును కలిసి వినతిపత్రం అందజేశారు. కలెక్టర్‌ని కలిసిన వారిలో కమిటీ నాయకులు కేజే ఉదయ్ బాబు, ఎం.బెంజిమెన్, ఎ.మత్తయి, ఎం.జాకబ్, డి.సత్యం, సీహెచ్.ఐజాక్, టి.కృపానందం, కే.ఇమ్మానుయేలు, జోసఫ్, సతీష్, ప్రసాద్, యోహాను ఉన్నారు.

హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పాండునాయక్

మఠంపల్లి : ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు రైతుబంధు, రుణమాఫీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు భూక్యా పాండునాయక్, మండల కార్యదర్శి మాలోతు బాలునాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం మఠంపల్లిలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు. రైతుబంధును 5ఎకరాల వరకు ఇవ్వాలని, రూ.2లక్షల వరకు రుణమాఫీ చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం సీనియర్ నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, సయ్యద్ రన్‌మియా, కె.వెంకటరెడ్డి, రాము, రవి, లింగయ్య, శంభయ్య, అప్పయ్య తదితరులు ఉన్నారు.

25న తిరుపతమ్మ కల్యాణ మహోత్సవం

నేరేడుచర్ల : మండలంలోని దాసారంలో ఈ నెల 25న శ్రీగోపయ్య సమేత తిరుపతమ్మ కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. ఈమేరకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వేద పండితులు కొంకపాక రాధాకృష్ణమూర్తి, ఆలయ ప్రధాన అర్చకులు హరి, సురేష్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో కల్యాణ ఉత్సవాలు జరగనున్నాయి. ఆలయంలో 25న ఉదయం సుప్రభాత సేవ, 9 గంటలకు విఘ్నేశ్వరపూజ, పంచామృతాభిషేకాలు, నూతన వస్త్రాలంకరణ, 10గంటలకు శాంతి కల్యాణం, మధ్యాహ్నం 1గంటకు నిరాజన మంత్రపుష్పం, అన్న ప్రసాద వితరణ, సాయంత్రం అమ్మవారి ఊరేగింపు, 26న ఉదయం బోనాల సమర్పణ ఉంటుందని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రుణమాఫీ చేయాలి

గరిడేపల్లి : రెండు లక్షల రైతు రుణమాఫీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్‌కె యాకూబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని కీతవారిగూడెం గ్రామంలో నిర్వహించిన సీపీఎం జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన లక్షల రుణమాఫీ హామీని నిలబెట్టుకోవాలని అన్నారు. రైతులు, కార్మికులు, నిరుద్యోగుల పట్ల ప్రభుత్వాలు శ్రద్ధ వహించి వారి సమస్యలను పరిష్కరిస్తే ప్రజలు ప్రభుత్వానికి అనుకూలంగా ఉంటారన్నారు. నీరందక పంటలు ఎండిపోయిన రైతులను గుర్తించి నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, నారాయణ, భిక్షం, అంకయ్య పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

మోతె : మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ ముప్పాని ఆశ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ హరిసింగ్‌నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

ఆలయంలో చోరీకి యత్నం

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని వేపలసింగారంలో గల గంగమ్మ గుడిలో గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి యత్నించినట్లు ఆలయ చైర్మన్ మద్దినాల వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని గ్రామపెద్దలను అయన కోరారు.

బూరుగడ్డ ఆలయంలో కుంకుమార్చన



గోమాతకు పూజలు చేస్తున్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణు గోపాలస్వామి దేవాలయంలో సహస్రనామ కుంకుమార్చనను అర్చకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, శ్రీగోదాదేవి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, సహస్రనామ కుంకుమార్చనలు, మన్యసూక్త పారాయణం, అష్టోత్తర శతనామావళి, ఆలంకరణ, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. అనంతరం గోమాతకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎంపి లక్ష్మణరావు, అర్చకులు ముడుంబై హరీష్‌కుమార్‌చార్యులు, మనోహరాచార్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

జీవకోటి మనుగడకు నీరే ప్రధానం



గరిడేపల్లి : ఇంకుడు గుంత నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ, మండల ప్రత్యేక అధికారి



మఠంపల్లిలో జల ప్రతిజ్ఞ చేస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ తదితరులు

గరిడేపల్లి : జీవకోటి మనుగడకు నీరే ప్రధానమని మండల ప్రత్యేక అధికారి శ్యాంప్రసాద్, ఎంపీడీఓ వనజలు అన్నారు. శుక్రవారం ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ వెంకటరావు ఆదేశాల మేరకు మండల పరిషత్ కార్యాలయంలో ఇంకుడు గుంత నిర్మాణ పనులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఇంటిలో ఇంకుడు గుంత ఉండేలా అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నీరు వృథాగా పోకుండా ఒడిసి పట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ మౌలానా, ఏపీఓ సురేష్, పంచాయతీ కార్యదర్శి సురేష్, ఫీల్డ్ అసిస్టెంట్ మేకపోతుల సరిత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

గరిడేపల్లి : జిల్లా కలెక్టర్ వెంకటరావు ఆదేశాల మేరకు వేసవి దృష్ట్యా గరిడేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం మండల స్పెషల్ ఆఫీసర్ శ్యాంప్రసాద్, ఎంపీడీఓ వనజలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీఓ మౌలానా, ఏపీఓ సురేష్, పంచాయతీ కార్యదర్శి సురేష్, ఫీల్డ్ అసిస్టెంట్ మేకపోతుల సరిత, సిబ్బంది పాల్గొన్నారు.

నీరు వృథా కాకుండా పర్యవేక్షించాలి

మఠంపల్లి : నీటి ఎద్దడి దరిచేరకుండా ఉండాలంటే గ్రామాలు, తండాల్లో నీరు వృథా కాకుండా అధికారులు, కార్యదర్శులు పర్యవేక్షించాలని తహసీల్దార్ మంగా, ఎంపీడీఓ జానకిరాములు కోరారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం శుక్రవారం మఠంపల్లి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో కలిసి జల ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కార్యాలయ ఆవరణలో ఇంకుడు గుంతల నిర్మాణ పనులు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామాల్లో పైపులైన్ల లీకేజీలకు, చేతిపంపులకు మరమ్మతులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ అంజనేయులు, ఏపీఓ ఉమాదేవి, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు తదితరులు పాల్గొన్నారు.

నీటి వృథాను అరికట్టాలి

నేరేడుచర్ల : నీరు వృథాను అరికట్టాలని మున్సిపల్ కమిషనర్ ఎ.అశోక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నేరేడుచర్ల మున్సిపల్ కార్యాలయంలో వరల్డ్ వాటర్ డే సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. వర్షాభావ పరిస్థితులతో భూగర్భ జలాలు అడుగంటి బోర్లు, బావులు ఎండిపోయి తాగునీటి సమస్య రానున్నదన్నారు. ప్రతిఒక్కరూ ఇంటిలో ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకునేలా మున్సిపల్ సిబ్బంది అవగాహన కల్పించాన్నారు. అనంతరం అధికారులు, సిబ్బందితో జల ప్రతిజ్ఞ చేయించారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

మండలంలోని చింతకుంట్ల ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ నీటి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు నీటి వినియోగం, నీటి ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కె.నాగార్జున్‌రెడ్డి, క్లబ్ ప్రధాన కార్యదర్శి జిలకర రామస్వామి, సభ్యులు కర్రి సూర్యనారాయణరెడ్డి, మాతంగి సైదులు, షఫీ తదితరులు ఉన్నారు.



నేరేడుచర్ల : అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ అశోక్‌రెడ్డి



నేరేడుచర్ల : చింతకుంట్ల ప్రాథమిక పాఠశాలలో ప్రపంచ నీటి దినోత్సవం

సందట్లో.. వసూలు మియా!

- ఇసుక లారీల యజమానుల వద్ద రూ.30వేలు వసూలు
- కోదాడలో చర్చనీయాంశంగా మారిన అధికారి నిర్వాకం

కోదాడ : ఆయన ఓ కిందిస్థాయి ప్రభుత్వ ఉద్యోగి. ఉన్నతాధికారి కన్నా ఎక్కువ బిల్డప్ ఇవ్వడం ఆయన ప్రత్యేకత. అందరు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు డ్యూటీ చేస్తే ఆయన మాత్రం సాయంత్రం ఏడు గంటల నుంచి రాత్రి పది గంటల వరకు డ్యూటీ చేసి ఆ తరువాత చల్లగా సేదదీరుతారు. ఎక్కడ డ్యూటీ వేసిన పక్కా కమర్షియల్ గా ఉంటారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఉన్నతాధికారులు తెలంగాణ- ఆంధ్రా సరిహద్దులో ప్రత్యేక తనిఖీ బృందాలను (ఎస్ఎస్‌టీ) ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం పక్కా కమర్షియల్ గా ఉండే ఉద్యోగికి బోర్డర్ చెక్‌పోస్ట్ వద్ద స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్ (ఎస్ఎస్‌టీ)లో సభ్యుడిగా డ్యూటీ వేశారు. అక్కడ డ్యూటీ చేస్తే ఏముంటది అనుకున్నాడో ఏమో గానీ సదరు అధికారి సమీపంలో అన్నారం వద్ద ఆంధ్ర ప్రాంతం నుంచి ఇసుక లారీలు రాత్రి సమయంలో నిలిపి ఉంచుతారని, అర్ధరాత్రి దాటిన తరువాత బోర్డర్‌దాటి తెలంగాణలోకి వస్తాయన్న సమాచారం సదరు ఉద్యోగికి చేరింది. వెంటనే ఆయన రంగంలోకి దిగాడు. విజిలెన్స్ అధికారిగా అవతారమెత్తాడు. వెంటనే మరో ముగ్గురిని తీసుకొని అర్ధరాత్రి ఇసుక లారీలు నిలిపి ఉంచే ప్రాంతానికి చేరుకొన్నారు. అక్కడ మూడు ఇసుక లారీలు ఉండడంతో తాము విజిలెన్స్ అధికారులమని, అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్నందున వెంటనే స్టేషన్‌కు లారీలను తీసుకొనిరావాలని హడావుడి చేసినట్లు సమాచారం. అసలే అక్రమ వ్యాపారం కావడంతో ఇసుక లారీల యజమానుల సదరు ఉద్యోగితో బేరసారాలకు దిగి, ఒక్కో ఇసుక లారీకి 30 వేల రూపాయల చొప్పున 90 వేలు సమర్పించుకున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని అక్కడే డ్యూటీ చేస్తున్న పోలీసులు కూడా గుర్తించినప్పటికి తోటి ప్రభుత్వ ఉద్యోగి కావడంతో వారు కూడా గుమ్మున ఉన్నట్లు సమాచారం. ఆ తరువాత ఇసుక వ్యాపారులు ఎన్నడూ లేనిది విజిలెన్స్ టీం రావడంపై వారు ఆరా తీయగా ఇదంతా ఎప్పుడూ పక్కా కమర్షియల్‌గా వ్యవహరించే ఉద్యోగి నిర్వాహకమేనని తెలుసుకొని లబోదిబోమంటున్నారు. ఈ విషయం ఇప్పుడు కోదాడలో పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపితే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని పలువురు అంటున్నారు.

విద్యార్థులకు అవగాహన

నడిగూడెం : పిల్లల అభిరుచికి అనుగుణంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గైడెన్స్ ఇవ్వాలని కోదాడ పట్టణానికి చెందిన ఎంఎస్ విద్యా సంస్థల సీఈఓ సేకు శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో కేరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు ముందుగా తమ లక్ష్యాన్ని ఎంచుకొని తదనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ ధన విజయలక్ష్మి, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు రవికృష్ణ, రజని, మూర్తి పాల్గొన్నారు.